అమలాపురానికి వరాల జల్లు

మంత్రి విశ్వరూప్ విజ్ఞప్తులపై స్పందించిన ముఖ్యమంత్రి జగన్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు శుక్రవారం జిల్లా కేంద్రం అమలాపురానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి వరాల జల్లు కురిపించారు. రూ.35 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు అభయం ఇచ్చారు. అమలాపురం బాలయోగి స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ అమలాపురం నియోజకవర్గంపై అమితమైన అభిమానం చూపించారు. స్థానిక ఎమ్మెల్యే అయిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అమలాపురం వచ్చిన జగన్‌కు నియోజకవర్గంలోని సమస్యలను వివరించినప్పుడు సానుకూలంగా స్పందించి వరాల జల్లు కురిపించారు.

జిల్లా కేంద్రంలో ఆ 3 వంతెనలకు రూ.10 కోట్లు

అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం అయ్యాక ట్రాఫిక్ పరంగా తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. దీంతో పట్టణ ముఖ ద్వారాలైన ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెనలపై ట్రాఫిక్ భారం పడి తరుచూ స్తంభించిపోతోంది. మంత్రి విశ్వరూప్ ఈ మూడు వంతెనలకు ప్రత్యామ్నాయంగా వాటి పక్కనే అదనంగా వంతెనలు నిర్మించాలని సీఎం జగన్‌ను కోరారు. తక్షణమే జగన్ స్పందించి ఆ మూడు వంతెనల నిర్మాణాలకు సభావేదిక పై నుంచే రూ.10 కోట్ల నిధులను ప్రజల హర్షాధ్వానాల మధ్య ప్రకటించారు.

గడపగడపకూ నిధులు రూ.25.60 కోట్లు మంజూరు

అమలాపురం నియోజకవర్గంలో గల 64 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గడపగడపకూ సందర్భంగా నాయకుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.25.60 కోట్లు సీఎం జగన్ మంజూరు చేశారు. ఈ సమస్యలను మంత్రి విశ్వరూప్ సీఎం జగన్ దృష్టిలో పెట్టారు. సీఎం ప్రకటనలతో సభలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. తాను చెప్పిన రెండు సమస్యలపై సీఎం జగన్ తక్షణమే స్పందించి అంగీకరించి నిధులు ప్రకటించడంతో మంత్రి విశ్వరూప్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



అభిమాన నేతకు అభివాదం



అండగా ఉండే అన్నను చూసేందుకు తండోపతండాలుగా..

జననేతకు ఘన స్వాగతం

అమలాపురం రూరల్/అంబాజీపేట: ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా శుక్రవారం అమలాపురం రావడంతో ఉభయ గోదావరి జిల్లాల నుంచి మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రహదారి పొడవునా జై జగన్ నినాదంతో హోరెత్తించారు. సున్నా వడ్డీ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎదురుచూసిన మహిళల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వర్షాలు, వరదల కారణంగా రెండు సార్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభ వాయిదా పడినప్పటికి నిరాశ చెందకుండా జగనన్న రాక కోసం ఎదురుచూశారు. ఎన్టీఆర్ మార్గ్, నల్లవంతెన, బాలయోగి ఘాట్ వరకు జనంతో కిక్కిరిసిపోయింది. సీఎంను చూసేందుకు భవనాలపైకి ఎక్కారు. దారి పొడవునా సీఎం అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జన సందోహంతో రహదారులు కిక్కిరిసిపోవడంతో సభాస్థలికి చేరుకోవడానికి సమయం పట్టింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు పలు వాహనాలలో మహిళలు చేరుకున్నారు. ఫొటోలు, ఫ్లెక్సీలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. తమ అభిమాన సీఎంను చేసేందుకు పలు గ్రామాల నుంచి వచ్చిన మహిళలు కాలినడకన సభా స్థలికి చేరుకుని ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్లవంతెన నుంచి ఎర్రవంతెన వరకు ఫ్లెక్సీలతో నింపి సీఎంపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. నల్లవంతెన వద్ద మాజీ కౌన్సిలర్, పార్టీ నాయకులు ఒంటెద్దు వెంకయ్యనాయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పూల వర్షం కురిపించాడు. సభా ప్రాంగణం నిండిపోవడంతో మండుటెండలో సైతం నిలుచొని జగనన్న ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు, దంగేటి అచ్యుత జానకిలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, గెద్దం సంపతరావు, కొనుకు గౌతమి, పట్టణ మండల పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి బద్రి బాబ్జి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జున్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.





సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ పండుల రవీంద్ర, ఎస్పీ శ్రీధర్

సీఎం సభకు భారీగా పార్టీ శ్రేణులు, మహిళలు

ముమ్మిడివరం: వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ నాలుగో విడత నిధులు విడుదల చేయటానికి అమలాపురం విచ్చేసిన సీఎం జగన్‌మోహనరెడ్డి బహిరంగ సభకు వివిధ గ్రామాల నుంచి భారీ స్థాయిలో మహిళలు, పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఆయా గ్రామాల నుంచి బస్సులు ,ఆటోలు, వివిధ వాహనాలలో మహిళలు, పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలాగంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, మట్టపర్తి సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.



ముఖ్యమంత్రికి స్వాగతమంటూ..

క్లుప్తంగా

స్థలాన్ని పోలీసు సేవలకు వినియోగించాలని వినతి

అమలాపురం టౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న అయిదు ఎకరాల పోలీసు స్థలాన్ని ఆ శాఖ సేవలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, 1991లో పోలీసు స్థల సేకరణ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన పీకే రావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అభ్యర్థిస్తూ ఆయనకు శుక్రవారం వినతి పత్రం అందించారు. అమలాపురం పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌కు ఈ మేరకు పీకేరావు వినతి పత్రం అందించి పోలీసు స్థలం గురించి కొద్దిసేపు వివరించారు. 1991లో అంబాజీపేట మండల పరిషత్ అధ్యక్షునిగా ఉన్న తాను అమలాపురం పోలీసు స్థల సేకరణ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించానని పీకే రావు చెప్పారు. అప్పట్లో సేకరించిన అయిదు ఎకరాల పోలీసు స్థలం నేడు ఖాళీగా ఉందని, ఆ స్థలంలో పోలీసు శాఖ సేవలకు అవసరమైన భవనాలు నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని సీఎం జగన్‌ను కోరారు.

మహాశక్తితో మహిళలకు చేయూత

ముమ్మిడివరం: మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఎంతో చేయూత లభిస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలో కర్రివానిరేవు, మర్లపాలెం, బూరుగుపేటలో శుక్రవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య రథం ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు అర్థాన్ని శ్రీనివాసరావు, దాట్ల పృథ్వీరాజ్, గొలకోటి దొరబాబు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రతినిధిగా మోహన్



అల్లవరం: ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన ఆకుమర్తి మోహన్ నియమితులయ్యారు. అమలాపురంలో ఎత్తురోడ్డు వద్ద నేదునూరి నాతనేయులు నివాసంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా మోహన్‌కు బాధ్యతలు అప్పగించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: జి.వేమవరం పంచాయతీ రామాలయం పేటలో విద్యుదాఘాతంతో మృతిచెందిన పుణ్యమంతుల గోవిందరాజు కుటుంబ సభ్యులకు రూ.10 వేల నగదును శుక్రవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి సుధారాణి తదితరులు చెక్కును మృతుని భార్య వరలక్ష్మికి అందజేశారు. మిగిలిన సొమ్మును బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు.

పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి

యానాం: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అయ్యన్ననగర్‌లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలుపుతూ కమ్యూనిటీ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల వయసుండే మగ పిల్లలు సిగరెట్, గంజాయి, మద్యం అలవాటుగా చేసుకుంటున్నట్టు పలు అధ్యయనాల్లో తేలిందని చెప్పారు. తమ పిల్లలు ఇంటికి ఆలస్యంగా వస్తే తల్లిదండ్రులు వారిని ప్రశ్నించాలని, ఆవిధంగా ప్రవర్తనా మార్పులు తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నూకరత్నం, గీత, విజయలక్ష్మి, షరీఫ్ పాల్గొన్నారు.

ఆ సంస్థల నిర్వాకంతో సాగునీటి ఎద్దడి

ఏపీబీ సమావేశంలో చైర్మన్ల ధ్వజం

తాళ్లరేవు: మండల పరిధిలో ఉన్న రిలయన్స్, జీఎస్పీసీ చమురు సంస్థల నిర్వాకం కారణంగానే సాగునీటి ఎద్దడి తలెత్తుతోందని ఏపీబీ చైర్మన్‌లు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో మండల వ్యవసాయాధికారిణి ఎస్.ప్రశాంతి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. కరప సబ్‌డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాబూరావు హాజరయ్యారు. పలువురు రైతులు తమ సమస్యలను మొర పెట్టుకున్నారు. సాగు ప్రారంభంలోనే నీటి సమస్య కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజరం వంతెన వద్ద తూములు వేయడం వల్ల పూడుకుపోయి పూర్తిస్థాయిలో సాగునీరు రావడం లేదని, వచ్చిన నీటిని మండల పరిధిలో ఉన్న రిలయన్స్, జీఎస్పీసీ సంస్థలు ఇష్టానుసారం తోడేస్తుండడంతో వరిచేలకు నీరు అందడంలేదని ఏపీబీ చైర్మన్లు నరాల రామకృష్ణ, రొక్కం లోవరాజు, కొల్లు రాజు, దడాల ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, పంపన రామకృష్ణ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఆయా సంస్థలకు సాగునీటి కోటా ఉందా అని ప్రశ్నించారు. వరిచేలకు పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రైతులు లేవనెత్తిన అంశాలన్నింటినీ పరిష్కరించాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. దీనిపై ఏడీ బాబూరావు మాట్లాడుతూ రైతులు పేర్కొన్న అంశాలను పై అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. రైతులందరూ విధిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. రాయుడు గంగాధర్, వెటర్నరీ వైద్యురాలు దవులూరి సుధ, వీఏఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ బాబూరావు

పదోన్నతి పొందిన డ్రైవర్‌కు సత్కారం

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో 34 ఏళ్లుగా ప్రభుత్వ డ్రైవర్‌గా సేవలు అందిస్తున్న ఎ.ముత్యాలు కు ఎల్ఎమ్‌వి- గ్రేడ్-1 డ్రైవర్ నుంచి స్పెషల్ గ్రేడ్ లెవిల్-6గా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ సందర్భంగా స్థానిక అంబులెన్స్ డ్రైవర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ముత్యాలును సత్కరించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 5గురికి పదోన్నతులు లభించగా యానాం నుంచి ముత్యాలుకు పదోన్నతి లభించింది.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

అంబాజీపేట: ఓ కారు అదుపుతప్పి ముక్కామల వద్ద పంట కాలువలోకి దూసుకుపోయింది. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ జలం చెరువుకు చెందిన పిల్లి సుధీర్‌బాబు, పిల్లి అనిల్, కె.బాబి, కట్టా ప్రసాద్‌లు కారులో వెళ్తున్నారు. ముక్కామల వచ్చేసరికి వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. కట్టా ప్రసాద్‌కు తప్పా మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా నా భూమి-నా దేశం

తాళ్లరేవు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చొల్లంగి పంచాయతీలో నా భూమి-నా దేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నా భూమి-నా దేశం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం, చైతన్య ర్యాలీ నిర్వహించి పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేసి జెండా వందనం చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఉప్పంగల, గాడిమొగ, జి.వేమవరం పంచాయతీలలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం పెండ్యాల అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు పోతాబత్తుల శ్రీనివాసరావు, వీజేవీ రమణ, సర్పంచ్‌లు కామాడి గోవలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు స్వర్ణ రాజు, శివాజీ గణేష్ పాల్గొన్నారు.



చొల్లంగి పంచాయతీలో మొక్కలు నాటుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఉప్పలగుప్తం: కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సమన్వయ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఆరీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక నాయకుడు, ఏఐసీసీ కోఆప్షన్ సభ్యుడు చీకట్ల అబ్బాయి నివాసం వద్ద ఆరిఫ్ అధ్యక్షతన శుక్రవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల, పట్టణ నియోజకవర్గ స్థాయిలో పార్టీ పునర్నిర్మాణం చేయడంపై సూచనలు ఇచ్చారు. గ్రామ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని తీర్మానించారు. ఏఐసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ సభ్యులు అయితాబత్తుల సుభాషిణి, దోనిపాటి విజయలక్ష్మి, కొత్తూరు శ్రీనివాస్, గెద్దం సురేష్ బాబు పాల్గొన్నారు.

డిక్ సెంటర్‌లో జెండాల అమ్మకం

యానాం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయజెండాను స్థానిక డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ సెంటర్ (డిక్)లో అమ్మకాలు చేస్తున్నట్లు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి ప్రకటనలో తెలిపారు. జెండాలు రెండింటిని రూ.18 కు అమ్ముతున్నట్లు తెలిపారు. కావాల్సినవారు మినీ సివిల్ స్టేషన్‌లోని మొదటి ఫ్లోర్‌లో డిక్ ఆఫీసు వద్దకు వెళ్లాలని కోరారు.

బాడ్మింటన్ క్రీడాకారులకు ఆర్థిక సహాయం

యానాం: పట్టణ పరిధిలో యానాం బాల్‌బాడ్మింటన్ క్లబ్‌లో శిక్షణ పొందడమే కాకుండా వివిధ జాతీయ టోర్నీల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ మరోవైపు వివిధ కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు శుక్రవారం క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శశేషసుమన్ రూ.25వేల సహాయం అందజేశారు. రవి కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్న ఇసుకపట్ల బిందుశ్రీకి, రీజెన్సీ కళాశాలలో ఇంటర్ చదువుతున్న లక్కవరపు దర్శన్‌కుమార్‌కు కళాశాల ఫీజుల నిమిత్తం ఈ మొత్తాన్ని అందజేశారు. కోచ్ బొట్టా శ్రీనివాస్, రాయపురెడ్డి విజయ్ పాల్గొన్నారు.



క్రీడాకారుల కళాశాల ఫీజుల కోసం సహాయాన్ని అందజేస్తున్న శేషసుమన్

అనధికార ఆక్వా చెరువులకు నోటీసులు

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో అనధికారకంగా సాగు చేస్తున్న ఆక్వా చెరువుల సాగు నిలుపువేయాలని మండల మత్స్యశాఖాధికారి ఎస్.నాగమణి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఆక్వా చెరువుల సాగుతో గ్రామాల్లో కాలుష్యం పెరిగి అనారోగ్యాల పాలవుతున్నామని గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేయటంతో నోటీసులు పంపామని ఆమె అన్నారు. సన్నవిల్లి గ్రామంలో 85 ఎకరాల ఆక్వా సాగు జరుగుతోందని, దానిలో కేవలం ఆరు గురు రైతులకు సంబంధించి మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. 58 మంది అనుమతులు లేకుండా సాగు చేస్తున్నారన్నారు. అనధికారంగా సాగు చేస్తున్న 10 మంది రైతులను గుర్తించి నోటీసులు అందించామని, రెండు రోజుల్లో మిగతా రైతులకు నోటీసులు అందించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 మంది రైతులు సాగుకు అనుమతి లేకుండా విద్యుత్ వినియోగం పొందుతున్నారని, విద్యుత్ శాఖకు సమాచారం తెలిపి కనెక్షన్ తొలగిస్తామని నాగమణి తెలిపారు.

విజ్ఞానం మానవాళికి ఉపయోగపడాలి


అమలాపురం టౌన్: శాస్త్ర సాంకేతిక విజ్ఞానం మానవాళి అభివృద్ధికి ఉపయోగపడాలి. వినాశనానికి కాదని జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం రాష్ట్ర కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.మనోహర్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో సత్యనారాయణ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వారం రోజులుగా జరుగుతున్న హిరోషిమా నాగసాకి డే కార్యక్రమాల ముగింపు సభ కూడా ఈ సదస్సులో నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1945 ఆగష్టు 6,9 తేదీల్లో జపాన్‌లోని రెండు కీలక నగరాలను అమెరికా చేతిలోని సాంకేతిక విజ్ఞానం ధ్వంసం చేసిందని గుర్తు చేశారు. అందుకే అణ్వస్త్రాలు వద్దు... అన్న వస్త్రాలు కావాలని జన విజ్ఞాన వేదిక విద్యార్థులకు అవగాహన కలిపించిందన్నారు. జన విజ్ఞాన వేదిక మరో ప్రతినిధి డాక్టర్ బి.రామప్రసాద్ మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకి నగరాలపై అప్పుడు జరిగిన అణుబాంబుల విస్ఫోటం వల్ల దాదాపు 2.50 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

మార్చ్‌ఫాస్ట్‌కు రిహార్సల్స్

యానాం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న మార్చ్‌ఫాస్ట్‌ను ప్రదర్శించేందుకు స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం వివిధ విభాగాల పోలీసులు రిహార్సల్స్‌ను నిర్వహించారు. వేడుకలకు ఇక నాలుగు రోజులే మిగిలిఉండటంతో ప్రతిరోజు ముమ్మర సాధన చేస్తున్నారు. ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం, ఎస్సై శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్సై పువ్వల వీరభద్రరావు మార్చ్‌ఫాస్ట్ రిహార్సల్స్‌ను పరిశీలించి పోలీసులకు సూచనలు ఇస్తున్నారు. ఈ రిహార్సల్స్‌లో ఐఆర్‌బీఎన్, సాధారణ పోలీసులు, హోంగార్డులు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



బాలయోగి స్టేడియంలో రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు